అభివృద్ధి చేసి చూపెట్టాం



నామినేషన్‌కు ర్యాలీగా బయల్దేరిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో ఎమ్మెల్సీ నవీన్, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు



నామినేషన్ పత్రాలతో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్లు



నామినేషన్‌కు ముందు పూజలో ఎమ్మెల్యే కృష్ణారావు, కుటుంబ సభ్యులు

- ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నా..
- మళ్లీ గెలిపించాలని అభ్యర్థిస్తున్నా..
- నామినేషన్ ర్యాలీలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్
- భారీ ర్యాలీగా నామినేషన్‌కు వెళ్లిన కార్పొరేటర్లు, కార్యకర్తలు
- అభివృద్ధిని చూసి బ్రహ్మాండమైన మెజార్టీ ఇస్తారని నేతల ధీమా

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబసభ్యులతో కలిసి కేపీహెచ్‌బీ కాలనీలోని వినాయక ఆలయం, కూకట్‌పల్లి హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కూకట్‌పల్లి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం తన మాతృమూర్తి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్‌లతో కలిసి కూకట్‌పల్లి నుంచి భారీ ర్యాలీతో నామినేషన్ వేయటానికి బయల్దేరి వెళ్లారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, కూకట్‌పల్లిలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపిస్తారని ఆశిస్తున్నానని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో మంత్రి కేటీఆర్ సహకారంతో వేల కోట్ల రూపాయలతో మంచినీటి సమస్య, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించామన్నారు.

◆ కూకట్‌పల్లి నియోజకవర్గంలో వేల మందికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే చెందుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారమే అభివృద్ధి చేసి చూపెట్టామన్నారు. ప్రజలందరూ ఆశీర్వదించి గెలిపిస్తే కూకట్‌పల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తామన్నారు. నామినేషన్‌కి తనతో పాటు వచ్చిన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్‌లు, కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.



నామినేషన్‌కు ముందు దర్గాలో జరిగిన ప్రార్థనలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే, నాయకులు



నామినేషన్ వేసిన వెంటనే కలిసొచ్చిన డివిజన్‌కు

- ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం
- ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలని సూచన

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఇంటింటికీ వెళ్లి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి కారు గుర్తుకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించాలని మహిళా కార్యకర్తలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు.గురువారం బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మాధవరం కృష్ణారావు నేరుగా ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ వచ్చారు. కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలసి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలసి సమావేశం ఏర్పాటు చేశారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేసి బీఆర్ఎస్‌కు అత్యధిక మెజార్టీ వచ్చేలా కృషి చేయాలన్నారు. తన కోసం 20 రోజులు కష్టపడితే ప్రజల కోసం ఐదేళ్లు పని చేస్తామన్నారు. ప్రజలు తనను నెత్తిన పెట్టుకుని అభిమానిస్తున్నారని వారికి సేవ చేసుకుంటానన్నారు. ఎన్నికలు వచ్చాయని ప్రజలకు తెలియని వ్యక్తులు కూడా కనిపించి మాయ మాటలు చెబుతూ ఉంటారని వారిని నమ్మొద్దని కోరారు.

◆ మాధవరం కృష్ణారావు ఏ పని తలపెట్టినా ముందుగా ఈశాన్య దిక్కున ఉండే ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ నుంచే మొదలు పెట్టడం ఆనవాయితీ. ఇక్కడి ప్రజలు తనను వారి కుటుంబ సభ్యుడిగా అదరించడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ సమావేశంలో నాయకులు నరేందర్‌గౌడ్, మక్కాల నర్సింగ్‌రావు, సయ్యద్ ఏజాజ్, బల్వంత్ రెడ్డి, ఇర్ఫాన్, మేకల హరినాథ్, బుర్రి యాదగిరి, కనకరాజు యాదవ్, ఐలేష్, పోచయ్య, మక్కాల సత్యనారాయణ, ఖదీర్ మహిళలు, నాయకులు పాల్గొన్నారు.



నామినేషన్ కోలాహలం

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి కూకట్‌పల్లి నియోజకవర్గంలో పొలిటికల్ హీట్ పెరిగింది. ఇన్ని రోజులు ప్రచారంలో బిజీగా ఉన్న వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్ చివరి తేదీ దగ్గర పడుతుండటంతో గురువారం నామినేషన్ దాఖలు చేశారు. పార్టీల నుంచి బీ–ఫామ్ అందుకున్న అభ్యర్థులు ర్యాలీగా వెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ల పత్రాలు అందజేశారు. నాయకులు, కార్యకర్తల సందడితో నామినేషన్ కేంద్రాల పరిసరాలు కోలాహలంగా మారియి. ఈ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

జంగ్ 2023 తెలంగాణ

నామినేషన్ వేసిన పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జరగబోయే ఎమ్మెల్యే ఎన్నికల్లో గురువారం మూడు పార్టీల ప్రధాన అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున మాధవరం కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ నుంచి బండి రమేష్, బీజేపీ–జనసేన పార్టీ నుంచి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్, బీఎస్పీ నుంచి బండరిగల్ల సంజీవరావు, ధర్మసమాజ్ పార్టీ నుంచి సంద్ర సునీల్‌కుమార్, స్వతంత్ర అభ్యర్థులుగా దినేష్ కలాం, వెంకటబాలకృష్ణ అరికెపూడి, లకుమాదేవి బండి, కె. బాలామణిలు నామినేషన్‌లు దాఖలు చేశారు. ఈ మేరకు మూసాపేటలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు.

నామినేషన్ దాఖలు చేసిన కూకట్‌పల్లి జనసేన అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్



కూకట్‌పల్లి: జనసేన పార్టీ కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా కేపీహెచ్‌బీ 5వ ఫేజ్ పార్కు వద్ద జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం భారీ ఎత్తున బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా నామినేషన్‌కు కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. రేషన్‌కార్డులు, డబుల్ బెడ్ రూమ్‌ఇళ్లు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల భవన నిర్మాణం ఎన్నో ఏళ్ల నుంచి జరగటం లేదని తెలిపారు. ఇలా అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈసారి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పన్నాల హరీష్‌రెడ్డి, వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరయ్యారు.

సుదర్శన మహాయాగం

ఈనెల 21 నుంచి లోక కల్యాణం విశ్వ శాంతి తిరుమల మహా పాదయాత్ర



యాగంలో ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షులు యోగేష్ ప్రభు, స్వామీజీలు

కూకట్‌పల్లి: గురువారం ఏకాదశి సందర్భంగా ఛత్రపతి శివాజీ యువసేన, లక్ష్యసాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 21నుంచి లోక కల్యాణం విశ్వశాంతి తిరుమల మహా పాదయాత్ర మొదలుకానుంది. కేపీహెచ్‌బీ కాలనీ ఎంఐజీ 578లో విజయలక్ష్మీ దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ గట్టు రంగాచార్యస్వామి ఆధ్వర్యంలో అంకురార్పణగా సుదర్శన మహాయాగం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ప్రజా ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో గెలుస్తాం

- కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా బండి రమేష్
- భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండి రమేష్ గురువారం నామినేషన్ దాఖాలు చేశారు. కేపీహెచ్‌బీ రమ్యాగ్రౌండ్స్ నుంచి బయలుదేరి కేపీహెచ్‌బీ వినాయక దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ ఎత్తున ర్యాలీగా బయలుదేరి మూసాపేట మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, కూకట్‌పల్లి సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేషన్ ర్యాలీ సాగిందిలా...

అక్కడి నుంచి పార్టీ కార్యకర్తలతో బోనాలు, డప్పుల కళాకారుల విన్యాసాల నడుమ ర్యాలీ ముందుకు సాగింది. టెంపుల్ బస్‌స్టాప్‌లో పార్టీ నేతలు భారీ గజమాలతో రమేష్‌ను సత్కరించారు. రమేష్‌కి మద్దతుగా టీజేఎస్, సీపీఐ, సీపీఎం పార్టీల నేతలు పాల్గొన్నారు. కేపీహెచ్‌బీ వీధులన్నీ కాంగ్రెస్ పార్టీ జెండాలతో యువత కేరింతలతో జనసంద్రంగా మారాయి. కేపీహెచ్‌బీ ధనలక్ష్మి సెంటర్ రోడ్ నం.1 లోధా టవర్, నాల్గో ఫేజ్ మసీదు, కైత్లాపూర్ ఆంజనేయ నగర్ మీదుగా మూసాపేటలోని జోనల్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది.



కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడుతున్నారు..

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలు అడుగడుగునా కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ప్రజలు ఆశీర్వాదంతో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుస్తుందన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఆరు నూరైనా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఇప్పటికే కర్ణాటకలో అక్కడ ప్రకటించిన గ్యారంటీలు విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈసారి కూకట్‌పల్లి నియోజకవర్గంలో తప్పుండా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ ప్రెసిడెంట్లు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



ఏసీబీకి చిక్కిన ఫైర్ అధికారి



షేక్ ఫరీద్

బాలానగర్: కూకట్‌పల్లి ఫైర్ స్టేషన్‌కు చెందిన ఫైర్ ఆఫీసర్‌ను ఏసీబీ అధికారులు అదుపులో తీసుకున్నారు. జేఎన్‌టీయూ క్యాంపస్‌లో కూకట్‌పల్లి అగ్నిమాపక శాఖ స్టేషన్ ఉంది. ఫైర్ ఆఫీసర్‌గా షేక్ ఫరీద్ విధులు నిర్వర్తిస్తున్నారు. దీపావళి దుకాణం ఏర్పాటుకు సంబంధించి లైసెన్స్‌కు రూ.3,500 రూపాయలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికి పోయారు. ఏసీబీ అధికారులు కూకట్‌పల్లి ప్రాంతంలో ఉన్నారని తెలిసి చాలా మంది అధికారులు భయపడ్డారు.